క్లుప్తంగా

నేడు, రేపు కోనూరులో గడప గడపకు మన ప్రభుత్వం

అచ్చంపేట: మండలంలోని కోనూరులో ఆది, సోమ వారాల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై గడప గడపకు తిరిగి అమలౌతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

వైభవంగా నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల



బెల్లంకొండ: మండలంలోని న్యూ చిట్యాల గ్రామంలో నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల వేడుకలను శనివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవలతో పూజలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని భక్తులు అమ్మవారికి పొంగళ్లు చేసి, భోనాలను ఎత్తుకుని ఊరింగింపుగా ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. భక్తులు అమ్మవారికి చీరె, పసుపు, కుంకుమ, గాజులను సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. గ్రామం పాడి పంటలతో ఉండాలని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూనావతు నరసింహానాయక్, ఎంపీటీసీ శ్రావణిబాయి, పార్టీ నాయకులు మర్రి ప్రసాదరెడ్డి, భద్రయ్య, వైస్ సర్పంచ్ హుస్సేన్, తులశీనాయక్, రామాంజనేయులు నాయక్, శైలజాబాయి, రామారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి ఎమ్మెల్యే బొల్లా పూజలు

ఈపూరు: మండలంలోని బొగ్గరంలో గల శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. మండలంలోని బోడెపూడివారిపాలెంలో గల శ్రీ మద్దిరాలమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: వేసవి సందర్భంగా శ్రీ కల్పవల్లి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం గీతా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 80మందికి గ్లూకోన్-డి, సబ్జా గింజలు, ఖర్జూర, బొప్పాయి పండ్లు పంపిణీ చేశారు. ముగ్గురు చిరు వ్యాపారులకు గొడుగులను అయ్యప్పస్వామి దేవాలయం కమిటీ చైర్మన్ కొత్తూరి గోపి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు వెల్లంపల్లి కేశవరావు, శ్రీ వాసవీ మిత్ర మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, రాయవరపు సురేష్, మండవ వెంకటరత్నం, నాగసరపు నరసింహారావు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

రొంపిచర్ల: మండలంలోని కొనకంచివారిపాలెంలో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన వీర్ల శ్రీనివాసరావు ఎకరం పొలంలో సాగు చేసిన పంట అగ్నికి ఆహుతైంది.అలవాల గ్రామం వైపునున్న పొలాల నుంచి వస్తున్న మంటలకు పంట దగ్ధమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల కిందటే మొక్కజొన్న కండెలు కోసి, పొలంలో కుప్పగా వేశామన్నారు. మరుసటి రోజు పొలం వద్దకు వచ్చి చూసే సరికి పంట మొత్తం అగ్నికి ఆహుతైందని వాపోయారు. ఈ ప్రమాదంలో సుమారు 30 క్వింటాళ్ల కండెలు కాలిపోయి, రూ. 60 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి చౌడేశ్వరీ ఏకాదశ జ్యోతి మహోత్సవం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవాన్ని ఈ నెల 23 నుంచి 25 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీతొగట వీర క్షత్రియ అభివృద్ధి సంఘం ప్రతినిధులు శనివారం తెలిపారు. 23న ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి కుంకుమ బండ్లు ఊరేగింపును ప్రారంభిస్తారు. 24న సోమవారం అమ్మవారికి పొంగళ్లు, మొక్కుబడులు సమర్పించుకుంటారు. సాయంత్రం ఆన కట్ట నిర్మాణం చేపడతారు. హోమ గుండ ప్రజ్వలన, జ్యోతుల ఊరేగింపు ప్రారంభిస్తారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదిన వేడుకలు

సత్తెనపల్లి : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో ఈద్గాలలో సామూహిక నమాజ్‌లు నిర్వహించారు. పట్టణంలోని ముస్లింలు మాచర్ల రోడ్‌లో గల ఈద్గా వద్ద వేలాది సంఖ్యలో హాజరై భక్తి ప్రపత్తులతో ప్రత్యేక సామూహిక నమాజ్‌లు నిర్వహించారు. ఈ నమాజ్ కార్యక్రమంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. వేడుకల్లో ముస్లిం సోదరులకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న ఏడాది అంతా ముస్లింలు ప్రశాంతమైన వాతావరణంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అందరికీ ఆ అల్లా దయ ఉండాలన్నారు. మంత్రి అంబటి తో పాటు వైఎస్ఆర్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కో ఆప్షన్ సభ్యుడు సహారా మౌలాలి, షేక్ జానీ, ఎస్.ఎమ్. యూనస్ ఇతర నాయకులు, మతపెద్దలు, పెద్ద ఎత్తున ముస్లీం సోదరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొమెరపూడి, నందిగం, గూడిపూడి, తదితర గ్రామాలల్లో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులు సామూహిక నమాజ్‌లు నిర్వహించారు.

నకరికల్లులో..

నకరికల్లు: పవిత్ర రంజాన్ పండుగను ముస్లిం సోదరులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నకరికల్లు, గుండ్లపల్లి, చేజర్ల, కుంకలగుంట, చాగల్లు, దేచవరం, చల్లగుండ్ల, చీమలమర్రి తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఈద్‌నమాజును జరుపుకున్నారు. తహసీల్దార్ ఎస్.సురేష్ గుండ్లపల్లిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నకరికల్లులోని రిజర్వాయర్ ఆనుకొని ఉన్న కొండపై గల ఈద్గా వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో ముస్లింసోదరులు ఈద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక పాతూరులోని పాతమర్కస్‌లో దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రత్యేక ప్రార్థనల సౌకర్యం ఏర్పాటు చేశారు. వేసవి తాపాన్ని తీర్చేందుకు యువకులు ఉచితంగా రస్నా, మజ్జిగ, మినరల్‌వాటర్‌ను పంపిణీ చేశారు. అనంతరం ప్రపంచశాంతి కోసం ప్రత్యేక దువా చేశారు.

ముప్పాళ్ళలో..

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈద్గాలను రంగులతో అందంగా ముస్తాబు చేసి సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు పాల్గొని మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని అందించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

రాజుపాలెం: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా జరుపుకున్నారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ అంటూ అల్లా నామస్మరణ చేస్తూ పురవీధుల్లో సామూహికంగా ఈద్గాల వద్దకు బయలుదేరారు. ఈద్గా వద్ద ప్రత్యేక నమాజ్‌ను పఠించారు. ఈ సందర్భంగా ఆయా మసీదులో మతపెద్దలు మాట్లాడుతూ పర మత సహనం పాటించాలన్నారు. ఇస్లాం శాంతి సామరస్యతకు, పరమత సహనానికి ప్రతీకని అన్నారు. ఈద్గా వద్ద ఇవ్వరికి వారు తోచిన విధంగా పేదలకు దాన ధర్మాలు చేశారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకులు



పట్టణంలోని ఈద్గాలో సామూహిక నమాజ్ చేస్తున్న ముస్లింలు



ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నంబూరు లను ఆశీర్వాదిస్తున్న ముస్లిం మత పెద్దలు



క్రోసూరులో రంజాన్ పండుగ ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

పెదకూరపాడు: ఉపవాసాలు, ప్రార్థనలు , దాన ధర్మలతో నెల రోజుల పాటు నియమనిష్ఠలతో గడిపిన ముస్లిం సోదరులు శనివారం రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సామూహికంగా వెళ్లి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావులను ముస్లిం మత పెద్దలు ఆశీర్వాదించారు.

క్రోసూరులో..

క్రోసూరు: ముస్లిం ప్రజలు పవిత్ర రంజాన్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని ముస్లింలు ఈద్గా మైదానాలు, మసీదులకు హాజరై ప్రత్యేక పండుగ నమాజులు ఆచరించారు. క్రోసూరులోని ఈద్గా మైదానంలో భారీ గా ముస్లింలు పాల్గొని నమాజులు ఆచరించారు. ఇమాం జమాలుద్దీన్ నమాజు పఠించారు. రంజాన్ విశిష్టతను తెలియచెప్పారు. నమాజులనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

అమరావతిలో...

అమరావతి: నియోజవర్గంలోని ముస్లిం సోదరులందరికి తాను అన్నింటా అండగా ఉండి వారి అభివృద్ధి కృషి చేస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా మండల పరిధిలోని లేమల్లె గ్రామంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజవర్గంలోని ముస్లిం సోదరులందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో ముస్లింసోదరులతో పాటుగా వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: రంజాన్ పండుగ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఊరు బయట ఉన్న ఈద్గా వద్దకు తరలి వెళ్లిన ముస్లింలు సోదరులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దకు సర్వమత సమానత్వం కోసం, రాష్ట్రాభివృద్ధికోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పరస్పర ఆలింగనంతో అభినందనలు తెలుపుకున్నారు. అచ్చంపేటలో ఉప సర్పంచ్ జాని, కమల్‌సైదా తదితరుల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. మాదిపాడులో వైఎస్సార్ సీపీ మైనారిటి విభాగం కార్యదర్శి షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కోసం పార్థనలు నిర్వహించారు. కస్తలలో సర్పంచ్ షేక్ మాబూసుభాని, జాన్ పీరా తదితరుల ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు.



నకరికల్లులో కొండపై గల ఈద్గా వద్ద ఈద్‌నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు



ముప్పాళ్ళలో ఈద్గావద్ద సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



రెడ్డిగూడెంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మాదిపాడులో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు

ముస్లింల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ముస్లిం మైనార్టీలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాలుగా కృషిచేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని అచ్చంపేటలో శుక్రవారం రాత్రి వెయ్యి ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ తోఫాకిట్స్ పంపిణీ చేశారు. ముస్లిం సోదరకలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒక్క ముస్లిమ్‌కు అయిన మంత్రివర్గంలో స్థానం కల్పించారా అని ప్రశ్నించారు. చంద్రబాబు ముస్లింలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని వారికి చేసిందేమి లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రితో పాటు నాలుగు ఎమ్మెల్సీ పదవులతో పాటు పలు కీలక పదవులను ముస్లింకు ఇచ్చిన విషయాన్ని తెలియచేశారు. అన్ని రంగాల్లో ముస్లింలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసుకునేందుకు కస్తల, దొడ్లేరు, మాదిపాడు, క్రోసూరు, పెదకూపాడు తదితర గ్రామాల్లో షాదీకానాల నిర్మాణానికి ఒక్కొక్కదానికి రూ.25 లక్షలు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతి ముస్లిం కుటుంబం నుంచి కనీసం ఒక్కరైన బాగా చదువుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలన్నదే తమ ధ్యేయం అని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ కంబాల వీరబాబు, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, మాజీ సర్పంచ్ నెల్లూరి చంద్రబాబు, పీఏసీయస్ మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, మార్కెట్‌యార్డు డైరెక్టర్ మేకల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ షేక్ జాని, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, బీసీ నాయకులు బీరువాల జాని, మైనారిటి నాయకులు షేక్ కమల్‌సైదా, మౌలానా, బాబర్, సలీమ్,'హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ ప్రార్థనల్లో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

బస్‌షెల్టర్, చలివేంద్రం ప్రారంభం



నకరికల్లు : వృత్తిరిత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడి స్వగ్రామంలో సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో షేక్.చందామౌలాలి, ఆదంబి, హుస్సేన్‌ల /-పకార్థం చందా మీరావలి, చందా మస్తాన్‌వలి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. దాత చందా మీరావలి మాట్లాడుతూ గ్రామంలో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులకు నీడను కల్పించేందుకు నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఆధునీకరించడంతో పాటు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ వృత్తిరిత్యా నెల్లూరులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మీరావలి స్వగ్రామంలో చేస్తున్న సేవలు ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో గుండ్లపల్లి ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు షేక్.సైదావలి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

బెల్లంకొండ: కృష్ణానదిలోకి వెళ్లిన గేదెలను తోలుకురావడానికి వెళ్లి శుక్రవారం గల్లంతైన రామనబోయిన అల్లయ్య అనే వ్యక్తి నీటిలో మృతి చెందినట్లు ఎస్ఐ కె. అమీర్ తెలిపారు. శుక్రవారం నుంచి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా దాదాపుగా పది గంటల పాటు శ్రమించగా శనివారం ఉదయం మృతదేహం లభించిందని తెలిపారు. మృతుని వివరాలను సేకరించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధితునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం కాగా, మరో కుమార్తె చదుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అల్లయ్య మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

నగరేశ్వరస్వామి శాంతి కల్యాణం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం 36వ వార్షికోత్సవంలో భాగంగా శ్రీగంగాపార్వతిసమేత నగరేశ్వరస్వామి శాంతి కల్యాణం శనివారం నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో భాగంగా ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో ఆలయ దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చిలకల సాంబశివరావు, కమిటీ సభ్యులు, దంపతులు పీటలపై కూర్చొని కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పదోన్నతిపై వెళ్తున్న చిలకా జాన్సన్‌కు ఘన సన్మానం

సత్తెనపల్లి: పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా సత్తెనపల్లి బ్రాంచ్‌లో అటెండర్ గా పనిచేస్తూ క్యాషియర్‌గా పదోన్నతి పొంది ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్తున్న చిలుక శ్రీనివాస రావు (జాన్సన్) కు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. శనివారం మన్నెం రెసిడెన్సిలో జరిగిన ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొని శ్రీనివాసరావుకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పౌర హక్కుల నేత చిలకా చంద్రశేఖర్, దళిత సేవాదళ్ రాష్ట్ర నాయకులు తాళ్లూరి అమర్నాథ్, ముప్పాళ్ళ మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు, వైఎస్ఆర్ సీపీ నాయకులు చిలకా రమణయ్య, ఎంఆఎఫ్ నాయకులు వజ్రగిరి విజయవర్ధన్, బీసీ నాయకులు గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, విజయ్ చందు, చింకా అంకమ్మ రావు, తదితరులు ఉన్నారు. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ ఎస్. విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కోటా సుధాకర్ ల ఆధ్వర్యంలో బ్యాంక్ ఆవరణలో శ్రీనివాసరావుకు ఘన సన్మానం నిర్వహించారు.



సత్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

బీజేపీని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం

సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు గుంటుపల్లి బాలకృష్ణ

సత్తెనపల్లి: ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బీజేపీని సాగనంపుదామని దేశాన్ని కాపాడు కుందాం అని సీపీఎం పల్నాడు జిల్లా కమిటీ సభ్యుడు గుంటుపల్లి బాలకృష్ణ పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజానీకంలో ప్రచారం చేసేందుకు సీపీఎం, సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 30 వరకు చేపట్టిన ప్రచార బేరి కార్యక్రమాన్ని శనివారం స్థానిక పుతుంబాక భవన్ వద్ద ఆయన ప్రారంభించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ , సీపీఐ నియోజకవర్గ నాయకులు నరిశెటి వేణుగోపాల్ లు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయ వలసిన సమయం ఆసన్నమైందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మోడీ, అమిత్‌షాల నాయకత్వంలో బీజేపీ- ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చును రాజేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు టెలికం, ఎల్ఐసీ, బ్యాంకింగ్ వ్యవస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే దానికోసం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నాశనం చేసి ఆహార ధాన్యాల కోసం అమెరికా వంటి విదేశాలపై ఆధారపడేటట్లు చేస్తుందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను, నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై పెను భారాలను మోపుతుందన్నారు. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరించడంతో నిరుద్యోగ సమస్య మరింత తీవ్రమౌతుందన్నారు. ఈ విధానాలపై ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు బనాయించి నోర్లు ముయిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ వినాశకర విధానాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేసేందుకు సీపీఎం, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రచార బేరి కార్య క్రమాన్ని చేపట్టి ప్రజల ముందుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజానీకమంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనుముల వీరబ్రహ్మం, పి.ప్రభాకర్, గద్దం సుసులోన్, జడ రాజ్ కుమార్, దామర్ల వెంకటేశ్వర్లు, ఎం హరిపోతురాజు, బిట్రా నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, రొంపిచర్ల పురుషోత్తం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ, పార్టీ నాయకులు

వైభవంగా తిరునాళ్ల

రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం గ్రామ పరిధిలోని దద్దానాల మిట్ట ఆంజనేయస్వామి తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పొంగళ్లు పొంగించి, స్వామికి నైవేద్యాలు సమర్పించారు. స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

క్రోసూరు: రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుభరోసా కోసం ఈనెల 30 వరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే రైతుభరోసా పొందుతున్న రైతులు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ఏఓ వేణుగోపాల్ శనివారం తెలిపారు. ఎవరు దరఖాస్తు చేసుకోవాలో తెలియచేస్తూ కొత్తగా పొలాలు కొన్న రైతులు, కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న రైతులు, పట్టాదారు పాస్‌పుస్తకం ఉండి కూడా ఆన్‌లైన్ లో నమోదు కాబడని రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీనికోసం 1బీకాపీ, పట్టాదారుపాస్ పుస్తకం కాపీ, ఆధార్ కాపీ, బ్యాంక్ పాస్‌పుస్తకం మొదటిపేజీ కాపీ, రేషన్ కార్డు కాపీ, ఆధార్‌నెంబర్ జతచేయబడిన ఫోను నంబర్‌తో పొలం ఉన్న రెవెన్యూ పరిధి గ్రామ రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి దరఖాస్తుచేసుకోవాలన్నారు. పొలం ఏ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉంటే ఆ గ్రామ రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని ఏఓ తెలిపారు.

విగ్రహావిష్కరణలో భాగస్వాములకు ధన్యవాదాలు



మాట్లాడుతున్న వడ్డెర సంఘ నాయకులు

సత్తెనపల్లి: వడ్డెర పల్లపు సత్తెన్నకు చరిత్రలో సముచిత స్థానం కల్పించిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వడ్డెర సామాజిక వర్గం హృదయాలలో సుస్థిరంగా నిలిచి పోతారని ఆ సంఘం నాయకులు అన్నారు. పట్టణ వడ్డెర సంక్షేమ సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పల్లపు సత్తెన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు, వడ్డెర సామాజిక వర్గ నేతలకు, ముఖ్య అతిథు లందరికీ, పాల్గొన్న ప్రతి ఒక్కరికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సత్తెనపల్లె గడ్డ ఎత్తిన వడ్డెర సత్తెన్న విగ్రహానికి అవకాశం ఇవ్వమని మంత్రి అంబటిని కోరగానే సత్వరం స్పందించి,, సత్తెనపల్లిలోని గుంటూరు- మాచర్ల ప్రధాన రహదారి పక్కన విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇచ్చి, విగ్రహ ఆవిష్కరణ విజయవంతానికి విశేష కృషి చేసిన ఆయనకు వడ్డెర సామాజిక వర్గమంతా రుణపడి ఉంటామన్నారు. కార్య క్రమానికి సహకరించిన ప్రభుత్వ సంస్థలకు, ప్రతినిధులకు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో వడ్డెర సంఘ నాయకులు వేముల వర ప్రసాదరావు, తన్నీరు శ్రీనివాస రావు, చెంబేటి శివ రామకృష్ణ ,పల్లపు అంకమ్మరావు, దేవండ్ల నాగయ్య, చల్లా ఆంజనేయులు, శివరాత్రి శ్రీనివాసరావు, మన్నెం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకులంలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 23న రాత పరీక్ష నిర్వహించనున్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం, బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలుర గురుకులంలో ఐదో తరగతిలో 80 సీటక్లు గాను 276 మంది దరఖాస్తు చేశారు. ఇంకా ఇక్కడ ఇంటర్మీ డియట్‌కు అనుమతి రాకపోయినప్పటికీ 126 మంది రాత పరీక్షకు హాజరయ్యేందుకు దరఖాస్తు చేశారు. అలాగే బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి 80 సీట్ల గాను 171 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ-40 సీట్లు, ఎంపీసీ- 40 సీట్లు కలిపి 80 సీట్లకుగాను 214 మంది దరఖాస్తు చేశారు. పరీక్షా నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఉంటుందని ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ ఓ.జాన్సన్, కెసీవీ. స్వర్ణ కుమారీలు శనివారం తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్ జిరాక్స్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్ తెచ్చుకోవాలన్నారు.



రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల